క్లుప్తంగా

ముగిసిన అళఘునాథ బ్రహ్మోత్సవాలు



లక్ష తులసి పూజలో పాల్గొన్న మహిళలు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని అళఘునాథ స్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు లక్ష తులసి పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పాబోలు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ప్రభుత్వ ఆదేశాలు వస్తేనే కొత్త పింఛన్లు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు : ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే కొత్త పింఛన్లు ఇస్తామని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం తిరుమూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన 'అర్జీ అగచాట్లు'అన్న శీర్షికన ఈ నెల 18న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు ఇప్పట్లో మంజూరయ్యే అవకాశం లేదన్నారు. జనవరి పైన పింఛను తీసుకుంటూ భర్త చనిపోతే ఆయన స్థానంలో భార్యకు పింఛన్ ఇచ్చేందుకు ఆదేశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

తాగునీటి వృథా



పైపులైన్ గేట్ వాల్వు వద్ద వృథాగా పోతున్న తాగునీరు

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ అధికారులు చిల్లకూరులో తాగునీటి పథకం నిర్వహణను గాలికొదిలేశారు. శంకర గిరిజన కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న ప్రధాన పైపులైన్ గేట్ వాల్వు తుప్పుపట్టి దెబ్బతినింది. కొంతకాలంగా నీరు వృథాగా పోతోంది. ఆ మార్గం మొత్తం బురదమయంగా మారింది. నీరు వృథాగా పోతుండడంతో ప్రెజర్ తగ్గి పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవి మొదలైన నేపథ్యంలో నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

వెంకటగిరి రూరల్ : మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం శక్తియాప్‌ను రూపొందించిందని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన బుధవారం మహిళల ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి వినియోగించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే పోలీసులు అక్కడికి చేరుకుని ఆదుకుంటారని తెలిపారు. వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు లాక్‌డు హౌస్ మానిటరింగ్ సిస్టంను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. రోడ్లపై పశువులను వదిలేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు

గూడూరు రూరల్ : రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాల కోసం కొంతమంది తప్పుడు సమాచారం ఇస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. దళారుల ద్వారా ధ్రువీకరణ పత్రాలను పొందాలనుకునుకుంటే ఇబ్బందులు పడతారని తెలిపారు. గూడూరుకు చెందిన మొగిరాల నాగేశ్వరరావు అనే వ్యక్తి అతని కుటుంబ సభ్యుల వివరాలు దాచి పెట్టి ధ్రువీకరణ పత్రం పొందాలని చూశారని తెలిపారు. దీనిపై వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో అతనిపై పోలీసు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరూ పంచాంగం చదవాలి

గూడూరు రూరల్ : ఉగాది రోజున ప్రతి ఒక్కరూ పంచాంగం చదవాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం గూడూరు శాఖ అధ్యక్షుడు శివకుమార్ కోరారు. ఆయన బుధవారం అలూరు శిరోమణిశర్మ ధర్మపత్ని చేతుల మీదుగా గూడూరులోని సంఘం కార్యాలయంలో పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిట్టమూరు శ్రీనివాసరావు, విద్యాలలిత, దూబగుంట శ్రీనివాస్ నరసింహారావు, సుబ్బారావు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఆనేపూడి-కల్లూరు గ్రామాల మధ్య 14ఆర్ మేజర్ కాలువ



నెల్లూరుపల్లి-నెలబల్లి గ్రామాల మధ్య అసంపూర్తిగా 14ఆర్ మేజర్ కాలువ



కలగానే గంగ కాలువ

మెట్ట భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన 14 ఆర్ మేజర్ తెలుగు గంగ కాలువ పనులు ముందుకు సాగడం లేదు. అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో రైతుల కల కలగానే మిగులుతోంది. ప్రస్తుతం కాలువ చెట్లు, ముళ్లపొదలతో రూపురేఖలు మారిపోయింది. కాలువ నిర్మాణం ఆగిపోయి పదేళ్లవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- తెలుగు గంగ కాలువ నిర్మాణంతో వేల ఎకరాలకు సాగునీరు
- అటవీ శాఖ అనుమతుల కోసం ఆగిన పనులు
- చెట్లు, ముళ్లపొదలతో పూడిపోతున్న కాలువ
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దొరవారిసత్రం : దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లోని 30 చెరువులకు నీటిని సరఫరా చేయడంతోపాటు పలు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో 14 ఆర్ మేజర్ తెలుగు గంగ కాలువ నిర్మాణానికి 2004–05లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అనుమతులు ఇచ్చారు. ఇందుకోసం రూ.11 కోట్లు మంజూరు చేశారు. ఈ కాలువ ద్వారా రెండు మండలాల్లోని 30 చెరువుల్లోకి సప్లయి చానళ్ల ద్వారా గంగ జలాలు సులువుగా చేరతాయి. అదేవిధంగా మెట్ట ప్రాంతాల్లోని సుమారు 7 వేల ఎకరాలకు పైగా పుష్కలంగా సాగునీరు అందుతుంది. ప్రజలకు తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. 14 ఆర్ మేజర్ కాలువ నెలబల్లి సమీపంలో తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ నుంచి మొదలై నెలబల్లి గ్రామం పరిధిలోని పంట పొలాలు మీదుగా నెల్లూరుపల్లి, మైలాంగం, నేలపట్టు, ఆనేపూడి, కల్లూరుకండ్రిగ, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాలను కలుపుకుంటూ సూళ్లూరుపేట మండలం ఆబాకు గ్రామంలోని చెరువుకు చేరుతుంది. అన్ని ప్రాంతాల్లో కాలువ పనులు పూర్తయ్యాయి. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో నెలబల్లి-నెల్లూరుపల్లి, సూళ్లూరుపేట-దొరవారిసత్రం మండల సరిహద్దు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో పనులు ఆగిపోయాయి.

గత ప్రభుత్వంలో అనుమతులు సాధించినా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎంతో కృషి చేసి అటవీ ప్రాంతంలో కాలువ తవ్వడానికి అధికారుల నుంచి అనుమతులు సాధించారు. పనులు చేయడానికి రూ.60 లక్షల నిధులు కూడా మంజూరు చేయించారు. ఈ లోపు సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో గంగ కాలువ పనుల గురించి పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ప్రస్తుతం కాలువ చెట్లు, ముళ్లపొదలతో నిండిపోయి రూపురేఖలు మారిపోయింది. ప్రభుత్వం, నాయకులు, అధికారులు స్పందించి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గొల్లపాళెం సమీపంలో చెట్లతో నిండిన సప్లయి చానల్

గంగ పనులు పూర్తి చేయాలి



14ఆర్ మేజర్ కాలువ పనులు పూర్తి చేస్తే మా చెరువు నీరు వస్తుంది. వందల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఏడాది పొడవునా పంటలు సాగు చేసుకోవచ్చు. మా ప్రాంతంలో కాలువ పూర్తయింది. ఇతర ప్రాంతాల్లో పనులు ఆగిపోయాయి. దీంతో మా చెరువులోకి నీరు రావడంలేదు. పనులు పూర్తి చేసే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలి.

– దేవరత్నం, నెల్లూరుపల్లి

కలగా మిగిలిన గంగ జలాలు



మెట్ట ప్రాంతంలోని రైతులను ఆదుకునేందుకు తెలుగు గంగ నీటిని అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పూనుకున్నారు. రూ.11 కోట్లు మంజూరు చేసి కాలువ నిర్మాణం చేపట్టారు. అడ్డంకులతో కొన్నిచోట్ల పనులు ఆగిపోయాయి. కాలువ పనులు పూర్తి చేసి అన్ని గ్రామాలకు గంగ నీరు ఇస్తామని నాయకులు చెప్పడం తప్ప కార్యరూపం దాల్చడంలేదు.

– రఘురామయ్య, శ్రీధనమల్లి

రూ.29.30 కోట్లతో మున్సిపాలిటీ బడ్జెట్



మాట్లాడుతున్న కటకం దీపిక, కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్ : రూ.29. 30 కోట్లతో నాయుడుపేట మున్సిపాలిటీ 2025–26 బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నాయుడుపేటలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ షేక్ ఫజులుల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సవరించిన బడ్జెట్ అంచనాలు, 2023–2024 ప్రణాళిక బడ్జెట్, 2025–26 బడ్జెట్ వివరాలను కమిషనర్ కౌన్సిలర్లకు వివరించారు. వాటిని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్ పర్సన్ దీపిక మాట్లాడుతూ కొత్త బడ్జెట్‌తో 25 వార్డుల్లో అభివృద్ధి పనులు చేసుకుందామన్నారు. పట్టణంలో మాజీ మంత్రి పసల పెంచలయ్య, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, జగ్జీవన్ రామ్, మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించేందుకు కౌన్సిల్ సభ్యులు అంగీకారం తెలిపారు. వైస్ చైర్మన్లు షేక్ రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, తొడకాటి విజయ్, కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదాయం సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

25న పోలేరమ్మ జాతర మొదటి చాటింపు

- మే 6, 7 తేదీల్లో జాతర



పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డికి తాంబూలం అందజేస్తున్న ఈవో రవికృష్ణ, కమిటీ సభ్యులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర మొదటి చాటింపును ఈ నెల 25న వేయనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు నానాబాల సుబ్బారావు, ఆకుల కుబేరు మణి, నల్లబోతుల రామారావు, రాగి శేషగిరి బుధవారం విన్నమాలలో ఉన్న ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి ఇంటికి వెళ్లి సంప్రదాయబద్ధంగా తాంబూలం అందజేశారు. అనంతరం జాతర వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 25న పోలేరమ్మ మొదటి చాటింపు వేసి జాతర వేడుకలను వేదపండితుల సూచనల మేరకు మే 6, 7, తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పెదకాపు శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా విన్నమాల గ్రామస్తులకు అమ్మవారి తాంబూలం అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది యుగంధర్, నాయకులు దేవత కిషోర్ శెట్టి, బిరదవాడ నారాయణ, మహేష్ రెడ్డి, గుంటూరు లక్ష్మయ్య, మదిరి జలంధర్, చిట్టిబాబు, ఆలయ పూజారి రాయపూడి మునిసురేష్, విన్నమాల గ్రామపెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

చిల్లకూరు : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు కోరారు. వారు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పెన్షన్ విధానంలో మార్పులు చేయాలని పలుమార్లు కోరినా కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. పెన్షన్ పొందే వారు మృతి చెందితే నామినీగా ఉన్న అతని భార్యకు జీవితాంతం పెన్షన్ ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, ఎంశేషయ్య, హరినాద్, రత్నయ్య, రాజారాం, గోపాల్ రెడ్డి, తిరుపతమ్మ, రామమ్మ పాల్గొన్నారు.

లోకాస్‌తో పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు



లోకాస్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

చిట్టమూరు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లోకాస్ (లోక్ ఆపరేటివ్ సిస్టమ్) అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఏప్రిల్ ఒకటి నుంచి పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు నిర్వహించనున్నట్లు ఏపీఎం గున్నయ్య తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం లోకాస్‌పై వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు రాష్ట్ర పరిధిలోనే ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒకే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుందన్నారు. యాప్‌లో ఆర్థిక లావాదేవీలు ఎలా చేయాలో వివరించారు. వీవోఏలకు త్వరలో యాప్ అందుబాటులోకి తీసుకువచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీకాంత్, చిట్టమూరు మండల సంఘ బంధం అధ్యక్షురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం



చికిత్స పొందుతున్న వెంకటరెడ్డి

కలువాయి (సైదాపురం) : కలువాయి మండలం దాచూరులో బుధవారం అన్నపై తమ్ముడు కత్తితో హత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం మేరకు.. దాచూరు గ్రామానికి చెందిన కండ్లగుంట వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి అన్నదమ్ములు. వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో వెంకటరెడ్డి బుధవారం నిమ్మతోటలో పనులు ముగించుకుని స్థానికంగా ఉన్న ఒక కూల్ డ్రింక్ షాపులో ఉన్నాడు. అక్కడికి చేరుకున్న అతని తమ్ముడు సుబ్బారెడ్డి వెంట తెచ్చుకున్న కత్తితో అన్నపై దాడి చేశాడు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్లాడుతున్న వెంకటరెడ్డిని స్థానికులు ఆటోలో నెల్లూరు తరలించారు. సుబ్బారెడ్డి గతంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్వో కంప్యూటర్ చోరీ

ఓజిలి: మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వో డిల్లెయ్యకు చెందిన కంప్యూటర్‌ను గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. రెవెన్యూ సిబ్బంది మంగళవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. దుండగులు అర్ధరాత్రి సమయంలో వీఆర్వో గదికి పక్కనున్న తలుపులు తెరిచి కంప్యూటర్‌ను చోరీ చేశారు. బుధవా రం ఉదయం కార్యాలయానికి వచ్చిన వీఆర్వో డిల్లెయ్య తలుపులు తెరిచి ఉండడం, కంప్యూటర్ చోరీకి గురైనట్టు గుర్తించి తహసీల్దార్ పద్మావతికి సమాచారం అందించారు. ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని ఆదేశించారు.

ఇదిలా ఉండగా కార్యాలయంలో తహసీల్దార్, డీటీ, ఇతర సిబ్బంది కంప్యూటర్లు వున్నాయి. వీఆర్వో డిల్లెయ్య కంప్యూటర్ మాత్రమే చోరీకి గురికావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీఆర్వో గది పక్కనే ఉపాధి హామీ సిబ్బంది రాత్రంతా విధులు నిర్వహించారు. దీన్నిబట్టి కావాలనే ఎవరో కంప్యూటర్‌ను తీసుకెళ్లి చోరీ జరిగినట్టు చిత్రీకరించినట్టు తెలుస్తోంది. కంప్యూటర్ చోరీపై డీటీ మధుసూదన్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి గాయాలు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రం మండల కార్యాలయాల సమీపంలో బుధవారం బైక్ బోల్తాపడడంతో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పాళెంపాడు గ్రామానికి చెందిన మనోహర్ బైక్‌లో తల్లంపాడులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి స్వగ్రామం వెళుతుండగా దొరవారిసత్రం మండల కార్యాలయాల సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. గాయపడిన అతన్ని టోల్ ప్లాజా అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు

సైదాపురం: రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఏవో హైమావతి కోరారు. ఆమె బుధవారం తురిమెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అంతర్ పంటలైన పుచ్చకాయల సాగు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిందన్నారు. దళారులను నమ్మి ధాన్యాన్ని వారికి విక్రయించవద్దన్నారు.

కనిపించని స్పీడ్ బ్రేకర్లు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- రెండు నెలల్లో 10 మందికి పైగా గాయాలు



భాష్యం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్- క్రాస్ రోడ్డులో భాష్యం, నారాయణ పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. స్కూల్ జోన్ కావడంతో రోడ్డు మధ్య రెండు నెలల క్రితం ఆర్అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఎత్తుగా వేశారు. వీటిని తెలిపే సూచిక బోర్డులు పెట్టలేదు. స్పీడ్ బ్రేకర్లకు రంగులు కూడా వేయకపోవడంతో వాహనదారులు గుర్తించక కింద పడుతున్నారు. రెండు నెలల వ్యవధిలోనే 10 మందికి పైగా గాయపడ్డారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని, వాటిని ఎత్తు తగ్గించి పెయింటింగ్ వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాము కాటుతో అస్వస్థతకుగురైన బాలుడు మృతి

తడ: పాముకాటుతో అస్వస్థతకు గురైన వేనాడు పంచాయతీ మూల గ్రామానికి చెందిన తేజేష్(7) బుధవారం మృతిచెందాడు. ఈ నెల 9వ తేదీ రాత్రి బాలుడు ఇంటిలో నిద్రించాడు. ఏదో కుట్టినట్టు అని పించి ఏడవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించి పాముకాటుగా నిర్ధారించుకున్నారు. వెంటనే సూళ్లూరుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి చెన్నై తీసుకెళ్లారు. ఈ క్రమంలో బుధవారం పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

చిల్లకూరు : మండలంలోని ఓడూరు రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై బుధవారం ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అల్లూరు మండలం ఇసకపాళెంకు చెందిన మస్తాన్(42) ఆటో డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు నెలకొన్నాయి. దీంతో అతను రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

చిట్టమూరు : మండలంలోని కొత్తగుంట నుంచి ఆరూరు వరకు ఉన్న నాయుడుపేట–మల్లాం రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారింది. ఈ రోడ్డు గుండా కొత్తగుంట, వడ్డికండ్రి, వేముగుంటపాళెం, తంబుగారిపాళెం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుల వద్ద వేసిన తూములు పగిలిపోయి గుంతలు పడ్డాయి. కోగిలి చెరువు కలుజు వద్ద రోడ్డు కోతకు గురైంది. ఇక్కడ ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సిందే. రాత్రిళ్లు ఈ రోడ్డులో ప్రయాణించేందుకు వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ అదాలత్

కోట: గూడూరు, కోట సబ్‌డివిజన్లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసం గురువారం ప్రత్యేక అదాలత్ నిర్వహించనున్నట్లు కోట సబ్ డివిజన్ ఏడీ చిన్నయ్య తెలిపారు. విద్యానగర్ కరెంట్ ఆఫీస్ వద్ద గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

నేడు ఉపాధి బహిరంగ సభ

నాయుడుపేట టౌన్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేసినట్టు వెల్లడించారు. పూర్తి వివరాలను సభలో వివరించనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

22, 23, 24 తేదీల్లో ఏఐకేఎంఎస్ మహా సభలు

సైదాపురం: మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్‌లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య తెలిపారు. ఆయన బుధవారం సైదాపురంలో విలేకరులతో మాట్లాడారు. సీలింగ్, బంజరు, మిగులు, ఫారెస్ట్ భూములను అర్హులైన దళితులు, ఆదివాసీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తులు

సైదాపురం : మహిళలు కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కోరారు. తెల్లరేషన్ కార్డు ఉన్న 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 45 రోజులు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్, కుట్టు మిషన్ ఇస్తామని తెలిపారు. అలాగే సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

కండలేరులో 50.025 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 50.025 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 580, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

గంగ నీరు విడుదల చేయాలని వినతి

పెళ్లకూరు: ఖరీఫ్ సీజన్‌కు ఏప్రిల్ మొదటి వారం నుంచి 7వ బ్రాంచ్ కాలువగుండా చెరువులకు తెలుగు గంగ నీరు విడుదల చేయాలని రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి చింతంరెడ్డి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఆయన బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎడగారు పంటకు సాగునీటి ఇబ్బంది లేకుండా గంగ నీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనల మేరకే పనులు

పెళ్లకూరు: గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు, మల్టీపర్పస్ స్పెసిలిటేషన్ గోడౌన్ వద్ద బెడ్ కాంక్రీట్ పనులను నిబంధనల మేరకు చేపట్టాలని పీఆర్ డీఈ సురేష్‌బాబు ఆదేశించారు. ఆయన బుధవారం చిల్లకూరు వడ్డిపాళెంలో ఉన్న మల్టీ స్పెసిలిటేషన్ గోడౌన్ వద్ద రూ.16 లక్షలతో చేపట్టిన బెడ్ కాంక్రీట్ పనులు, చిల్లకూరు గిరిజన కాలనీలో చేస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేష్, కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, రాజారెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కోట: కోటలోని ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో కేవీఎన్ కుమార్ తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లకు పలు సూచనలు చేశారు. అవకతవకలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ఎమ్మార్సీకి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో మస్తానయ్య ఉన్నారు.

హిందీ పరీక్షకు 12 మంది గైర్హాజరు

చిట్టమూరు : మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో–2 ప్రసాద్ తెలిపారు. చిట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 146 మందికి గాను 142 మంది, అరవపాళెం జెడ్పీహైస్కూల్లో 140 మందికి గాను 135 మంది, కొత్తగుంటలోని టీఎమ్మార్ స్కూల్లో 142 మందికి గాను 140 మంది పరీక్షలు రాసినట్టు వివరించారు.